# అమ్మ

## మాచిరాజు వెంకటరత్నం

**సరిగ్గా రాత్రి రెండు గంటల పదినిమిషాలయింది.**

**గాఢనిద్రలో వున్న నేను టెలిఫోన్ రింగ్‌కి ఒక్కసారి ఉలికిపడి లేచాను. ఈ రాత్రి డ్యూటీలో కూడా లేను ఎవరు పిలుస్తున్నారా అనుకుంటూ.**


**టెలిఫోన్‌లో ఘోష వినగానే తెలిసిపోయింది అది ఇండియా కాలని.**

**"అన్నయ్యా" అని అరుస్తున్నారు అటువైపు నుంచి. గొంతు ఎంత బొంగురుపోయినా తెలిసింది తమ్ముడు వేణు ఫోను చేస్తున్నాడని. "ఏంటిరా? నేను అన్నయ్యని" అని నేనూ గొంతు ఎత్తి అరిచాను.**

"అమ్మ చచ్చిపోయిందన్నయ్యా" అని పెద్దగా ఏడుస్తున్నాడు ఫోనులో. ఒక్కక్షణంలో నా గుండె పరిగెత్తటం మొదలెట్టింది. మెదడులోని నరాలన్నీ ఒక్కసారిగా బిగపట్టుకుపోయాయి. శరీరమంతా ఎలక్ట్రిక్ షాక్ ప్రవహించి స్తంభించిపోయింది. ఫోను చేతిలో నుంచి జారి కిందపడింది. ఈ చప్పుడికి పక్కనే వున్న సుజాత లేచింది. "ఏంటండీ? ఏమయిందీ?" అంటూ.

"అమ్మ చనిపోయిందట" పెదాలు తడబడుతున్నాయి. గొంతులోంచి మాట సరిగ్గా రావటంలేదు. తనుకూడా వులిక్కిపడ్డది. "అత్తయ్యగారు పోయారా?" అంటూ కింద నుంచి ఫోను తీసుకుంది. అవతల ఫోనులో వేణు ఏడుస్తున్నాడు. సుజాతే మాట్లాడింది కొన్ని వివరాలు తెలుసుకోటానికి. ఇంకేముందు త్వరగా దహనక్రియకు అన్ని ఏర్పాట్లు చేస్తారట.

ఇదివరలో అప్పుడపుడు అనుకునేవాణ్ణి. అమెరికాలో వున్న మనందరికి ఎప్పుడో ఒకసారి యిలాంటి ఫోను వస్తుందని. అలాంటి ఆలోచనే తప్ప దాని పర్యవసానం ఏమిటో మన మనస్సు శరీరం ఎలా రియాక్ట్ అవుతాయో కొంచెం కూడా ఊహకందలేదు. నిజంగా దూరం అనేదే ఒక్క సమస్య అయితే, ఆంధ్రదేశంలో తల్లిదండ్రులుండి, ఏ ఢిల్లీలోనో బొంబాయిలోనో పిల్లలు ఉద్యోగం చేసుకుంటుంటే వాళ్ళకీ అంతేకదా! ట్రెయిన్‌లో ఉత్తరదేశం నుంచి దక్షిణం వెళ్ళాలంటే ఒకరోజు గడిచిపోతుంది. ఆ మాటకొస్తే, ఆంధ్రదేశంలోనే రెండుమూడు మూలల తల్లిదండ్రులు, పిల్లలూ వుంటే, ఒక మూల నుంచి ఒక మూలకెళ్ళాలంటే యిరవైనాలుగు గంటలు అయిపోతుంది. ఇలాంటి దుర్ఘటన జరిగినప్పుడు చివరిచూపులు కూడా దక్కవుకదా? అలాంటి ఆలోచనలలో మనగతికి అమెరికాలో ఉండటంలో తప్పేమీలేదని సమర్థించుకోగలిగాను యింతకాలం. కానీ ఈ క్షణంలో అలాంటి ఆలోచనలు నా మనస్సుని సమర్థించలేకపోతున్నాయి. నిజం చెప్పాలంటే ప్రతివాడికీ ఒక తల్లీ తండ్రీ వుంటారు. ప్రతివాళ్ళకీ ఎప్పుడో ఒకప్పుడు ఇలాంటి



దుర్ఘటన జరగక తప్పదు. జీవితమనేది నీటిబుడగలాంటిది. మన తల్లిదండ్రులే కాదు, మనం మన పిల్లలు కూడా కాలచక్రంలో తిరుగుతూ, ఎప్పుడో ఒకప్పుడు అసువులు వదిలేయాలికదా! అనే మెట్టవేదాంతాన్ని చాలా లాజికల్‌గా ఆలోచిస్తున్నాననుకునేవాణ్ణి. అలాంటిది యిప్పుడు అమ్మ చనిపోయిందంటే నరాలు ఎందుకు బిగుసుకుపోతున్నాయి. పెదాలు తడబడటం, చేతులు వణికిపోవడం ఎందుకు జరుగుతుంది. ఇన్నాళ్ళు ఏభైఏళ్ళు నిండిన నాకు డెబ్భైయ్యో వడి దాటిన తల్లిదండ్రులున్నారంటే చాలా అదృష్టంగా భావించేవాళ్ళు.

అప్పుడప్పుడు అనుకునేవాణ్ణి. అందరం పెద్దవాళ్ళం అవుతున్నాం కాబట్టి తల్లిదండ్రులిద్దరూ వృద్ధాప్యంలో మంచానబడకుండా కాలం దాటిపోతే చాలా అదృష్టం అని. ఎప్పుడో చేసిన పుణ్యంఅనే ఆలోచన వచ్చేది. అలాంటిది యిప్పుడు అమ్మకు గుండెపోటు వచ్చి సరదాగా తిరుగుతున్న మనిషి అరగంటలో కళ్ళు మూసిందంటే ఎప్పుడో చేసుకున్న సుకృతం అని ఒక్కమాటలో మనసుని స్థిమిత పరచుకోలేకపోతున్నాను. గుండె చికిత్సలలో నిపుణుడనయిన నేను అమ్మ గుండెపోటుతో చనిపోయిందంటే జీవిత సంగ్రామంలో భగవంతుడిచ్చిన ఓటమిని అంగీకరించలేకపోతున్నాను. అమెరికాలో ఎనభై లేక తొంభై ఏళ్ళు నిండిన వాళ్ళున్నా అదా అమెరికాలోనే చెల్లుతుంది. మనదేశంలో అన్నాళ్ళు బతకటం కష్టం. డెబ్బయి ఏళ్ళు దాటిన తర్వాత దేముడి మీద భారం వేసివున్నన్నాళ్ళు ఉంటామంటే నేను కూడా తల ఆడించి ఊరుకున్నాను. కానీ యీనాడు మనసులో ఏదో పెట్టి కెలికినట్లయింది. నిజం చెప్పాలంటే ఈమధ్య అమ్మా, నాన్నల గురించి ఆలోచించటమే లేదు. వాళ్ళపాటికి వాళ్ళు కృష్ణా, రామా అనుకుంటూ గడిపేస్తున్నారులే అని నా పనులలో నేను బిజీగా ఉండిపోతున్నాను.

"ఏమండి పిల్లల చదువు గురించి మీరేమీ పట్టించుకోవటంలేదని" సుజాత సతమాయిస్తుంటే ఏదో తప్పుచేసిన, బాధ్యత మరచిన తండ్రిలా అవుతానేమో ననుకునేవాణ్ణి. అందువల్ల ఈమధ్య ఆలోచనలన్నీ పిల్లల గురించే తప్ప అమ్మ నాన్నల గురించి అసలు ఆలోచించటమేలేదు.


ఎక్కడికయినా వెకేషన్‌కి ఎ సెంట్ థామస్‌కో, బెర్ముడాకో వెళ్ళి, భార్యాపిల్లలతో కలిసివుండి సరదాగా కాలం గడిపితే తండ్రిగా నా బాధ్యత నెరవేరుస్తున్నాననుకునేవాణ్ణి. పోయిన సంవత్సరం వేణుతో మాట్లాడుతుంటే "అన్నయ్యా! అమ్మ, నాన్నలను కాశీకి, కన్యాకుమారికి తీసుకెళ్ళా"నంటే, "చాలా మంచిపని చేసావురా?" అని అమ్మ నాన్నలకు డబ్బు ఎంత ఖర్చయిందో చెప్పు, నేను యిస్తానన్నాను. నా బాధ్యత అంతా డబ్బు

యివ్వటం వరకే అనిపించింది. నా బాధ్యతను నేను సవ్యంగా నిర్వర్తిస్తున్నాననే భావన నా మనసులో నాటుకుపోయింది. ఇండియాకు వెళ్ళటం, రావటం ఈమధ్య అంతగా కుదరలేదు. అలాంటిది ఒక్కక్షణంలో నాలో నేనే హంతకుడిలాగా దోషిగా మనసులో పీడిస్తుంటే, అమ్మకు నాన్నకు యింకా ఎంతో చేసి వుండాల్సింది, నా బాధ్యతను నేను సరిగ్గా నిర్వర్తించలేదేమోననే భావన నా మనస్సులో అమావాస్య నాటి చీకటిగా కప్పేసింది.

ప్రాణం పోవాలంటే పెద్ద కారణం ఉండక్కర్లేదు. ఒక్కొక్కసారి చిన్నకారణాల వల్ల కూడా ప్రాణం పోవచ్చు. కారణం ఎలాంటిదో తెలుసుకోవాలంటే కొన్ని పరీక్షలు చేయించాలి. అలాంటిది తెలిసి కూడా నేను పరీక్షలు చేయించలేదంటే నా బాధ్యతను మరచిపోయానా? అమ్మమీద ప్రేమ లేదా? ప్రేమలేదని కాదు. అమ్మ అంటే నాకు ఎంతో ప్రాణం, వాళ్ళు బతికున్నంతకాలం కష్టాలుపడకుండా, మంచంమీద పడి మూలుగుతూ కాలం గడపకుండా, హాయిగా నవ్వుతూ కన్ను మూస్తే చాలు అనుకున్న నేను ఇప్పుడు తప్పు చేసినవాడిలా, గిల్ట్ ఫీలింగ్‌తో మనస్సనే న్యాయస్థానంలో నన్ను సమర్థిస్తూ వాదించే లాయరు కూడాలేని ముద్దాయిలాగా మౌనంగా ఉండిపోయాను. అవును నిజంగా తప్పు చేసాను. అమ్మకి ఇండియాలోనేకాదు, అమెరికాలో కూడా ప్రముఖులైన వైద్యులకి చూపించి తగిన వైద్యాన్ని చేయించగలిగిన ధనం శక్తి పలుకుబడీ వున్నాయి. అప్పుడు అమ్మ హాయిగా చనిపోతే చాలు అనుకున్న నేను "అన్నయ్యా! ఇరవై అయిదు ఏళ్ళకే తల్లిని పోగొట్టు కున్న దురదృష్టవంతురాల్ని" అంటూ నా చిన్ని చెల్లెలు ఎదురయి కళ్ళనీళ్ళు పెట్టుకుంటే ఏం సమాధానం యివ్వగలను? మేం పదిమంది తోబుట్టువులం. నేను పెద్దవాణ్ణి. ఇరవైఅయిదు సంవత్సరాల తర్వాత పుట్టిన ఆడపిల్ల నా స్వంత చెల్లెలే అయినా, నాకూ దానికీ ఎంతో దూరం వుంది. అందువల్ల దాని మనసులోని ఆలోచనల గురించి ఆలోచించలేకపోయాను.

ఈ క్షణం నుంచి అమ్మ మాట్లాడదు. నవ్వదు. కళ్ళల్లో వెలిగే వెలుగు ప్రమిదలో చమురు లేకపోతే ఆరిపోయిన జ్యోతిలా మిగిలిపోయింది. చిన్నప్పుడు 'తలకు చమురు రాస్తారా' అని తన చేతులతో నూనె వేసుకుని నా తలలో చేతివేళ్ళు పెట్టినపుడు కలిగిన స్పర్శ కావాలి. ఆ మెత్తని వేళ్ళు నా తలలో నాట్యమాడుతూంటే నా తల మీద గగుర్పొడిచేది. అలాంటి అనుభవం అప్పుడు బాగున్నా యింక చాల్లే అంటూ తల ఆడిస్తూ వెళ్లిపోయేవాణ్ణి. ఇప్పుడు ఆ అనుభవం మరలా కావాలి. అప్పుడొకసారి నేను ఒక్కణ్ణి ఇండియా వెళ్ళాను. తల్లిదండ్రుల్ని, తోబుట్టువుల్ని చూశానుకానీ నా మనసంతా అమెరికాలో వున్న మా పిల్లల మీదే వుండిపోయింది. ప్రతిక్షణం వాళ్ళ గురించే ఆలోచించటం. బాగా మిస్ అయ్యాను పిల్లలిద్దరినీ. ఒక్క వారం రోజుల తర్వాత తిరుగుప్రయాణం పెట్టుకున్నాను. అమ్మ నన్ను బతిమాలుకున్నది "ఒరేయ్! యింకొక రెండురోజులు ఉండిపోరా. అంత దూరం నుంచి వచ్చావు కదా!" అని అంటూ.

**"ఒరేయ్, కడుపుతీపి నీకే కాదురా, నాకు కూడా ఉంటుంది" అన్నది. నా పిల్లల్ని చూడాలనే తాపత్రయంలో అమ్మ మాటలోని అంతరార్థాన్ని అర్థం చేసుకోలేకపోయాను. నేను చిన్నప్పుడు అమ్మతో కలిసివున్న ప్రత్యేక సంఘటనలన్నీ రంగులరాట్నంలో కదిలే రంగులలాగా, చలనచిత్రంలో మారే దృశ్యంలాగా ఒక్కొక్కటి జ్ఞాపకం రావటం మొదలెట్టాయి.**



"లేదే, పిల్లల్ని చూడాలి, తిరిగి వెళ్ళాలి" అని నిక్కచ్చిగా చెప్పాను.

"ఒరేయ్, కడుపుతీపి నీకే కాదురా, నాకు కూడా ఉంటుంది" అన్నది. నా పిల్లల్ని చూడాలనే తాపత్రయంలో అమ్మ మాటలోని అంతరార్థాన్ని అర్థం చేసుకోలేకపోయాను.

నేను చిన్నప్పుడు అమ్మతో కలిసివున్న ప్రత్యేక సంఘటనలన్నీ రంగులరాట్నంలో కదిలే రంగులలాగా, చలనచిత్రంలో మారే దృశ్యంలాగా ఒక్కొక్కటి జ్ఞాపకం రావటం మొదలెట్టాయి.

అమ్మా, నాన్నలను పదేళ్ళ క్రిందట అమెరికాకు రప్పించాను. విమానంలో అమ్మపక్క ఇద్దరు ఆర్థోడాక్స్ జ్యూయిష్ మనుషులు కూర్చొన్నారు. నల్లగుడ్డలు, టోపీ కొంచెం గడ్డం, ముఖ్యంగా చెవుల పక్కనే కిందకు వస్తున్న గిరజాల వెంట్రుకలు. వాళ్ళు తమ వేళ్ళు వెంట్రుకలలో పెట్టి మెలికలు తిప్పుతూంటే నవ్వు ఆపకుండా వచ్చింది అని వున్నన్నాళ్ళు చెప్పిచెప్పి నవ్వేది.

వచ్చిన వారం రోజుల నించి నాన్న ఇక్కడ ఏమీ తోచటం లేదు. తిరిగి వెళ్లిపోతానంటూ కూర్చున్నారు. అమెరికా వచ్చి ఆరువారాలైనా ఉండకుండా తిరిగి వెడితే అందరూ నవ్వుతారు అని కూర్చుంది అమ్మ. చివరకు అమెరికా నుంచి తిరిగి వెళ్ళిం తర్వాత ఆమె సంబరం పట్టశక్యం కాలేదు మా బంధువులెవ్వరి కీను. ఎవరితో మాట్లాడినా ప్రతి నిమిషంలో ఒకసారయినా నేను మా పెద్దబ్బాయి దగ్గరకు వెళ్లి అమెరికాలో వుండి వచ్చాను అని చెప్పాలి.

"ఏమండీ! వేణు అడు గుతున్నాడు సూర్యాస్తమయంలోగా దహనక్రియలు చెయ్యాలట. మీరెలాగూ ఈలోపల వెళ్ళటం కాదు కాబట్టి ఈపూటే దహనక్రియలు చేస్తారట. సరేనా?" సుజాత నన్ను కదిపింది.

అమ్మ! ఆఖరి క్షణంలో దగ్గర లేకపోయాను. ఇన్నాళ్ళు ఆవిడ గురించి పెద్దగా ఆలోచించకపోయినా ఈ క్షణంలో మెదడులోని ప్రతి అణువులోనూ గాఢంగా ముద్రవేసుకుపోయింది ఆమె రూపం. పెద్దయిన తర్వాత ఎప్పుడూ పడని వేడి కన్నీళ్ళు నా చెక్కిళ్లమీద జారటం మొదలెట్టాయి.